
# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 83 వ భాగం

### వృత్రాసుర వృత్తాంతం – 7, దేవగురువుగా విశ్వరూపుడు

క్రితం వ్యాసంలో బృహస్పతి తిరస్కారంతో వెళ్ళిపోయాక దేవతలు విశ్వరూపుణ్ణి గురువుగా స్వీకరించారని, ఆ విశ్వరూపుడు ఇంద్రుడికి నారాయణకవచం ఉపదేశించాడని శుకమహర్షి పరీక్షిత్తుతో చెప్పాడని చదివాం. ఆ నారాయణ కవచం ఎటువంటిది, దానితో ఇంద్రుడెలా మామూలుగా తమ మీదకి వచ్చిన రాక్షసులని జయించాడు అనేవి ఇప్పుడు చెప్తున్నారు శుకమహర్షి పరీక్షిత్తుతో.

సీ. వినవయ్య! నరనాథ! మునినాథుఁ డింద్రున;
కనువొంద నారాయణాఖ్య మైన
కవచంబు విజయ సంకల్పంబు నప్రమే;
యస్వరూపంబు మహాఫలంబు
మంత్రగోప్యము హరిమాయావిశేషంబు;
సాంగంబుగాఁగ నెఱుంగఁ జేసె;
దాని నే వినిపింతుఁ బూని తదేకాగ్ర;
చిత్తంబుతోడుతఁ జిత్తగింపు; [6-298]

తే. మొనర ధౌతాంఘ్రిపాణి యై యుత్తరంబు
ముఖముగా నుత్తమాసనమున వసించి
కృత నిజాంగ కరన్యాస మతిశయిల్ల
మహిత నారాయణాఖ్య వర్మము నొనర్చె. [6-298.1]

విజయాన్ని కూర్చే ఈ నారాయణ కవచాన్ని రహస్యంగా కాపాడుకోవాలంటూ చెప్పి దాన్ని ఎలా పఠించాలో, చెప్తున్నారు. ఉత్తరదిశగా కూర్చుని అంగన్యాస, కరాన్యాసం చేసి నారాయణ కవచాన్ని ప్రయోగించాలి.

వ. ఇట్లు నారాయణకవచంబు ఘటియించి, పాదంబులను, జానువులను, నూరువులను, నుదరంబునను, హృదయంబునను, నురంబునను, ముఖంబునను, శిరంబునను నట్లష్టాంగంబులం బ్రణవపూర్వకంబైన యష్టాక్షరీ మంత్రరాజంబు విన్యాసంబుచేసి ద్వాదశాక్షర విద్యచేతం గరన్యాసంబు చేసి, మంత్రమూఁర్తియై భగవచ్ఛబ్ద వాచ్యం బైన ప్రణవాది యకారాంత మహామంత్రంబు చేత నంగుళ్యంగుష్ఠ పర్వసంధులయం దుపన్యసించి, మఱియు హృదయంబున నోంకారంబు, వికారంబు మూర్ధంబున, షకారంబు భ్రూమధ్యంబు నందు, ణకారంబు శిఖ యందు, వేకారంబు నేత్రంబులయందు,

నకారంబు సర్వ సంధులయందు మఱియు నస్త్రము నుద్దేశించి మకారంబు నుపన్యసించె నేని మంత్రమూర్తి యగు; మఱియును "అస్త్రాయఫట్" అను మంత్రంబున దిగ్బంధనంబుచేసి, పరమేశ్వరునిం దన భావంబున నిల్పి విద్యామూర్తియుఁ, దపోమూర్తియు నగు షట్చక్తి సంయుతం బైన నారాయణ కవచాఖ్య మైన మంత్రరాజంబు నిట్లని పఠియించె. [6-299]

అష్టాక్షరీ మత్రంతో (ఓం నమోనారాయణాయ) ముందు ఈ ఎనిమిది అక్షరాలనీ అష్టాంగాలతో (పాదాలు, జానువులు, ఊరువులు, ఉదరం, హృదయం, వక్షస్థలం, ముఖం, శిరస్సు) విన్యాసం చేయాలి. తర్వాత ద్వాదశాక్షర మంత్రంతో (ఓం నమో భగవతే వాసుదేవాయ) కరన్యాసం చేయాలి. ఈ విన్యాసాలని కరన్యాసాలని మనం పూజ చేసేచోట, శివాలయంలో కూడా చూడవచ్చు. ఒక్కో మంత్రాక్షరం చెప్పినప్పుడు, ఆయా అంగాలు కానీ వేళ్ళ కణుపులు కానీ ముట్టుకుని ఆయా అక్షరాలు నోటితో చెప్పడం, అప్పుడు భగవంతుణ్ణి మనసులో తలుచుకోవడం, అదే సమయంలో ఉద్ధరిణితో నీళ్ళు చేతులో పోసుకోవడం వగైరా అన్నవి. శివాలయంలో అనేక గంటల సేపు పట్టే ఏకాదశ రుద్రం, అభిషేకం చేసేటపుడు, ముందుగా "--- తన్మే మన: శివసంకల్పమస్తు" అంటూ చెప్పడం ఇటువంటిదే. ఇదంతా ఎందుకంటే, అసలు మంత్రం పఠించే ముందు చెడ్డ ఆలోచనలూ, అవరోధాలూ రాకుండా భగవంతుణ్ణి వేడుకోవడానికి. అసలు "తన్మే మన: శివసంకల్పమస్తు" అంటేనే 'నా మనస్సు మంచి ఆలోచనలతో ఉండుగాక' అనే కదా? మనం, మన శరీరం లో ఉండే ఆత్మ కూడా భవగత్స్వరూపం అని చెప్పడానికే ఈ అంగన్యాసం, కరాన్యాసం కూడా.

చ. గరుడుని మూఁపుపై బదయుగంబు ఘటిల్లఁగ శంఖచక్ర చ
ర్మ రుచిర శార్ఙ్గ ఖడ్గ శర రాజితపాశ గదాది సాధనో
త్కర నికరంబు లాత్మకరకంజములన్ ధరియించి భూతి సం
భరిత మహాష్టబాహుఁడు కృపామతితో ననుఁ గాచుఁ గావుతన్. [6-300]

మొదట అంగన్యాస, కరాన్యాసాలు చేసాక, ఇప్పుడు భగవంతుడి స్తుతి. గరుడుడి మూపుపై కూర్చుని ఎనిమిదిచేతులతో శంఖ, చక్ర, గదా ఖడ్గ, బాణ పాశం అనే ఆయుధాలు ధరించిన కరుణతో నన్ను కాపాడుగాక. ఎలా కాపాడాలి? కృపామతితో – కరుణా దృష్టితోటి.

ఆ. ప్రకట మకర వరుణ పాశంబు లందును
జలములందు నెందుఁ బొలియ కుండఁ
గాచుఁగాక నన్ను ఘనుఁడొక్కఁ డై నట్టి
మత్స్యమూర్తి విద్యమానకీర్తి [6-301]

దశావతారాలతో మొదలుపెడుతూ చెప్తున్నారు ఇప్పుడు. వరుణ పాశాలలో పడకుండా, జలాలలోంచి ఘనుడు, మత్స్య మూర్తి అయినటువంటి విష్ణువు నన్ను కాపాడాలి (గాచుగాక).

క. వటుఁడు సమాశ్రిత మాయా
నటుఁడు బలిప్రబల శోభనప్రతిఘటనో
ద్భటుడు త్రివిక్రమదేవుఁడు
చటులస్థలమందు నన్ను సంరక్షించున్. [6-302]

మాయా వటుడిగా అవిర్భవించి బలి సంపదలని అపహరించిన త్రివిక్రమదేవుడు నన్ను అన్ని భయంకరమైన (చటుల) స్థలాలలోనూ సంరక్షించాలి.

చ. అడవుల సంకటస్థలుల నాజిముఖంబుల నగ్ని కీలలం
దెడరుల నెల్ల నాకు నుతి కెక్కఁగ దిక్కగుఁగాక శ్రీనృసిం
హుఁడు సురశత్రుయూథప వధోగ్రుడు విస్ఫురి తాట్టహాస వ
క్త్రుఁడు ఘన దంష్ట్ర పావక విధూత దిగంతరుఁ డప్రమేయుఁడై. [6-303]

ఇది నృసింహావతారం గురించి. అడవుల్లో, సంకట స్థలాలలో, యుద్ధాలలో (ఆజి ముఖంబుల), అగ్ని కీలలలో రాక్షసులని వధించే నృసింహదేవుడు నన్ను కాపాడాలి. ఈ పద్యంలో రాక్షసులు అనేది ఎక్కడుందో చెప్పండి? సురశత్రు – దేవతల శత్రువులు – రాక్షసులు.

చ. అరయఁగ నెల్ల లోకములు నంకిలి నొంద మహార్ణవంబులో
నొరిగి నిమగ్న మైన ధర నుద్ధతిఁ గొమ్మున నెత్తినట్టి యా
కిరిపతి యగ్ని కల్పుఁ దురుఖేలుఁడు నూర్జిత మేదినీ మనో
హరుఁడు గృపావిధేయుఁడు సదాధ్వములన్ననుఁ గాచుఁగావుతన్. [6-304]

పై పద్యం వరాహావతారం గురించి. లోకాలన్నీ మహార్ణవంలో మునిగినప్పుడు ధరణి ని పైకెత్తినట్టి ఆ వరాహస్వరూపుడు అన్నింటా నన్ను కాపాడాలి. ఈ పద్యంలో కిరిపతి అంటే కిరి – వరాహము, పతి, ప్రభువు. ఈ భాగవతం చదువుతున్నంతసేపూ అసలు మనం తెలుగువాళ్లమేనా, మనకి తెలుగు భాష వచ్చా, రాదా అనేది ప్రశ్నించుకోవాల్సిందే. తర్వత వచ్చే పద్యంలో రామావతారం గురించి చెప్తున్నారు.

సీ. తాటక మర్దించి తపసి జన్నముఁ గాచి;
హరువిల్లు విఱిచి ధైర్యమున మెఱసి
ప్రబలు లైనట్టి విరాధ కబంధోగ్ర;
ఖరదూషణాది రాక్షసులఁ దునిమి
వానరవిభు నేలి వాలిఁ గూలఁగ నేసి;
జలరాశి గర్వంబుఁ జక్కజేసి
సేతువు బంధించి చేరి రావణ కుంభ;
కర్ణాది వీరులఁ గడిమిఁ ద్రుంచి [6-306]

తే. యల విభీషణు లంకకు నధిపుఁ జేసి
భూమిసుతఁ గూడి సాకేత పురము నందు
రాజ్యసుఖములు గైకొన్న రామవిభుఁడు
వరుస ననుఁ బ్రోచుచుండుఁ బ్రవాసగతుల. [6-306.1]

తాటకి చంపి, విశ్వామిత్రుడి యజ్ఞం (జన్నము) కాపాడి, శివధనస్సు (హరువిల్లు) విరిచిన రాముడు, విరాధ, కబంధులని చంపి, ఖరధూషణాదులనీ వాలినీ నేలకూల్చిన రాముడు, సముద్రుడి గర్వాన్ని అణిచి, సేతువు నిర్మించి, రావణ కుంభకర్ణులని చంపి విభీషణుణ్ణి లంకకి రాజుగా చేసిన రామవిభుడు నన్ను దూరప్రదేశాలలో (ప్రవాస గతుల) నన్ను కాపాడుగాక. మరోసారి పద్యం చదివి చూడండి, ఈ పద్యంలో వింత ఏమిటంటే, రామావతారంలో రాముడు చేసినవన్నీ ఏదోవిధంగా ఇరికించకుండా, రాముడు చేసిన ఆయా పనులు సరైన వరసలో చెప్పడం.

వ. మఱియు; నఖిల ప్రమాదంబు లైన యభిచార కర్మంబుల వలన నారాయణుండును, గర్వంబు వలన నరుండును, యోగభ్రంశంబువలన యోగనాథుఁ డయిన దత్తాత్రేయుండును, గర్మబంధంబులవలన గణేశుం డైన కపిలుండును, గామదేవునివలన సనత్కుమారుండును, మార్గంబుల దేవహేళనంబు చేయుటవలన శ్రీహయగ్రీవమూర్తి యును, దేవతానమస్కార తిరస్కార దేవపూజా చ్ఛిద్రంబులవలన నారదుండును, నశేష నిరయంబులవలనఁ గూర్మంబును, నపథ్యంబు వలన భగవంతుం డైన ధన్వంతరియును, ద్వంద్వంబువలన నిర్జితాత్ముం డయిన ఋషభుండును, జనాపవాదంబువలన నగ్నిదేవుండును, జనన మరణాదులం గలుగఁ జేయు కర్మంబులవలన బలభద్రుండును, గాలంబువలన యముండును, సర్పగణంబులవలన శేషుండును, నప్రబోధంబువలన ద్వైపాయనుండును, బాషాండ సమూహంబువలన బుద్ధదేవుండును, శనైశ్చరునివలనఁ గల్కియునై, ధర్మరక్షణపరుం డయిన మహావతారుండు నన్ను రక్షించుంగాత; ప్రాత స్సంగమ ప్రాహ్ణ మధ్యాహ్నాపరాహ్ణ సాయంకాలంబులను ప్రదోషార్ధరాత్రాపరాత్ర ప్రత్యూషానుసంధ్యలను గదాద్యాయుధంబుల ధరియించి, కేశవ, నారాయణ, గోవింద, విష్ణు, మధుసంహార, త్రివిక్రమ, వామన, హృషికేశ, పద్మనాభ, శ్రీవత్సధామ, సర్వేశ్వరేశ, జనార్దన, విశ్వేశ్వర, కాలమూర్తు లను నామ రూపంబులు గల దేవుండు నన్ను రక్షించుంగాక; ప్రళయకాలాన లాతితీక్ష్ణ సంభ్రమ భ్రమణ నిర్వక్రవిక్రమ వక్రీకృత దనుజచక్రం బైన సుదర్శన నామ చక్రంబ! మహావాయు ప్రేరితుండై హుతాశనుండు నీరస తృణాటవుల భస్మీభూతంబు చేయు భంగి, భగవత్ప్రయుక్తంబవై మద్వైరి సైన్యంబుల దగ్ధంబు గావింపుము; జగత్సంహారకాల పటు ఘటిత చటుల మహోత్పాత గర్జారవ తర్జన దశదిశాభి వర్జిత ఘనఘనాంతర నిష్ఠ్యూత నిష్ఠురకోటి శతకోటిసం స్పర్శ స్ఫుర ద్విస్ఫులింగ నిర్గమనానర్గళ భుగ భుగాయమాన మూర్తి విస్ఫూర్తి! నారాయణకరకమలవర్తి! గదాయుధోత్తమ! మదీయవైరి దండోపదండంబుల భండనంబునం జండ గతిం బిండిపిండిగాఁ గూశ్మాండ వైనాయక రక్షో భూత గ్రహంబులు చూర్ణంబులుగాఁ గొండొక వినోదంబు సలుపుము; ధరేంద్రంబ వైన పాంచజన్యంబ! సర్వలోక జిష్ణుండైన శ్రీకృష్ణునిఁ నిఖిల పుణ్యైక సదన వదన నిష్ఠ్యూత నిశ్వాసాధర వేణు పూరితంబవై యున్మత్త భూత, ప్రేత, పిశాచ, విప్ర గ్రహాది క్రూర దుర్గ్రహంబులు విద్రావణంబులుగా, నస్మ త్పరవీరమండ లంబుల గుండియలతోఁ దదీయమానినీ దుర్భర గర్భంబులు గర్భస్థార్భక వివర్జితంబులుగా నవియ, బ్రహ్మాండభాండ భీకరంబయిన భూరి నాదంబున మోదింపు; మతి తీవ్రధారా దళిత నిశాతకోటి కఠోర కంఠ కరాళ రక్తధారా ధౌత మలీమస విసరంబవయిన నందక మహాసి శేఖరంబ! జగదీశ ప్రేరితంబవై మద్విద్వేషి విషమ వ్యూహంబుల మెండు ఖండములుగ ఖడించి చెండాడుము; నిష్కళంక నిరాంతక సాంద్ర చంద్రమండల పరిమండిత సర్వాంగ లక్షణ విచక్షణ ధర్మనిరతం బవయిన చర్మంబ! దుర్మద మద్వైరిలోకంబులకు భీకరాలోకంబులను సమాకుల నిబిడ నిరంధ్ర నిష్ఠుర తమః పటల పటు ఘటనంబులం గుటిల పఱుపుము; నిఖిల పాపగ్రహంబుల వలనను సకల నర మృగ సర్ప క్రోడ భూతాదులవలనను నగు భయంబులు పొందకుండ భగవన్నామ రూప యాన దివ్యాస్త్రంబుల రక్షించు గాక; బృహద్రథంతరాది సామంబులచేత స్తోత్రంబు చేయం బడుచున్న ఖగేంద్రుండు రక్షణ దక్షుండై నన్ను రక్షించుఁగాక; శ్రీహరి నామ రూప వాహన దివ్యాయుధ పారిషదోత్తమ ప్రముఖంబు లస్మదీయ బుద్ధీంద్రియ మనఃప్రాణంబుల సంరక్షించు; భగవంతుండయిన శేషుండు సర్వోపద్రవంబుల నాశంబు చేయు; జగ ద్వైక్యభావంబయిన ధ్యానంబు గలవానికి వికల్పరహితుండై, భూషణాయుధ లింగాఖ్యలగు శక్తులం దన మాయ చేత ధరియించి తేజరిల్లు చుండు లక్ష్మీకాంతుండు వికల్ప విగ్రహంబులవలన నన్ను రక్షించుఁగాక; లోకభయంకరాట్టహాస భాసుర వదనగహ్వరుం డగుచు, సమస్త తేజోహరణ ధురీణ తేజః పుంజ సంజాత దివ్య నృసింహావతారుం డగు నప్పరమేశ్వరుండు సర్వ దిగ్భాగంబు వలన, సమస్త బహిరంతరంబుల వలన నన్ను రక్షించుచుండుఁ గాత" మని నారాయణాత్మక కవచ ప్రభావం బితిహాస రూపంబున నింద్రుండు దెలిసికొని, ధ్యానంబు చేసి, తద్విద్యాధారణ మహిమవలన నరాతుల నిర్జించెం; గావున నెవ్వరేని నిర్మలాత్ము లగు వార లే తద్విద్యా ధారణులై యనుదినంబును బఠియించిన; నతి ఘోర రణంబుల నత్యుత్కట సంకటంబులను, సర్వ గ్రహ నిగ్రహ కర్మ మారణకర్మాది దుష్కర్మ జన్య క్లేశంబులను వదలి, యవ్యాకుల మనస్కులై, విజయంబు నొందుదురు; మఱియును, సర్వ రోగంబులకు నగమ్యశరీరులై సుఖంబు నొందుదురు; అదియునుం గాక. [6-307]

ఈ వచనంలో మిగిలిన నారాయణావతారాల గురించి చెప్తున్నారు. అన్ని ప్రమాదాలకు కారణాలైన అభిచార ప్రయోగాలనుండి నారాయణుడు, గర్వపడడం నుండి నరుడు (నరనారాయణ ద్వయంలోనివాడు), యోగాభ్యాసం నుండి పతనం కాకుండా యోగాలకు అధిపతి అయిన దత్తాత్రేయుడు, కర్మబంధాల నుండి గణాధిపతి అయిన కపిలుడు (ఈయన తల్లికి యోగమార్గం చూపినవాడు), మన్మథుని నుండి సనత్కుమారుడు (చిన్న తనంలోనే కోరికలని విడిచినవాడు కనక), దారిలో వెళ్తూ దేవతలను అవహేళన చేసిన పాపం నుండి శ్రీహయగ్రీవుడు, దేవతలకు నమస్కారం చేయకుండా తిరస్కరించినప్పుడు, దేవపూజలో లోపం జరిగినందుకు నారదుడు నన్ను కాపాడుగాక! అంతులేని నరకాలనుండి కూర్మమూర్తి (మందర పర్వతం పాలసముద్రంలో పడిపోకుండా పైకి ఎత్తి రక్షించాడు కనక), తినరానిది తిన్న దోషం నుండి భగవంతుడైన ధన్వంతరి (మనం రోజువారీ చేసే పని ఇదే కదా? తినరానిది తినడం, మందులు వేసుకోవడం; అందువల్లే వైద్యుడైన ధన్వంతరి ప్రస్తావన), శీతోష్ణాది ద్వంద్వాల నుండి జితేంద్రియుడైన ఋషభుడు నన్ను రక్షించుగాక!

లోకుల నిందల నుండి అగ్నిదేవుడు (సర్వభక్షకుడు) నన్ను కాపాడుగాక! చావు పుట్టుకలు కలిగించే అసత్కర్మల నుండి బలభద్రుడు నన్ను రక్షించుగాక! కాలప్రభావం నుండి యముడు కాపాడుగాక! సర్ప సమూహం నుండి ఆదిశేషుడు నన్ను రక్షించుగాక! అజ్ఞానం నుండి కృష్ణద్వైపాయనుడు (వేదమే జ్ఞానం కనక) నన్ను కాపాడుగాక! వేదవిద్యా విముఖుల నుండి బుద్ధదేవుడు (ఈయన వేదమార్గం వదిలి సత్యం వేరేగా కనుక్కున్నవాడు) శనిపీడ నుండి కల్కి నన్ను కాపాడుగాక! ఈ విధంగా ధర్మరక్షణ పరాయణుడైన శ్రీమన్నారాయణుడు ఆయా రూపాలలో నన్ను రక్షించుగాక!

ఉదయం, మధ్యాహ్నం, పట్టపగలు, సాయంకాలం, మునిమాపువేళ, అర్ధరాత్రి, అపరాత్రి, పత్యూషకాలం, సంధికాలాలు, ప్రభాతం అనే సకల సమయాలలో గద మొదలైన ఆయుధాలను ధరించి కేశవుడు, నారాయణుడు, గోవిందుడు, విష్ణువు, మధుసూదనుడు, త్రివిక్రముడు, వామనుడు, హృషీకేశుడు, పద్మనాభుడు, శ్రీవత్సాంకుడు, సర్వేశ్వరుడు, జనార్దనుడు, విశ్వేశ్వరుడు, కాలమూర్తి అనే నామ రూపాలు కలిగిన దేవుడు నన్ను రక్షించుగాక! పూజ చేసేటపుడు ఆచమనం చేస్తూ ఇదే వరసలో చెప్తూ ఉండడం గమనించవచ్చు. ఓం కేశవాయస్వాహా --- గోవింద, విష్ణు, మధుసూదన, త్రివిక్రమ, వామన --- అచ్యుత, హరే, శ్రీకృష్ణాయనమ: శ్రీకృష్ణప్రబ్రహ్మణేనమ:

ఇంతవరకూ చెప్పాక ఇప్పుడు విష్ణువుకున్న ఆయుధాలగురించి. ప్రళయకాలపు అగ్నిజ్వాలలతో అతి తీవ్రంగా తిరుగుతూ రాక్షస సమూహాన్ని చీకాకు పరచే సుదర్శన చక్రమా, నా శత్రువులను నిశ్శేషంగా దహించు. శ్రీమన్నారాయణుని చేతులలో ఉండే కౌమోదకీ గదాదండమా, నా విరోధులను పిండి కావించు. శ్రీకృష్ణుని పుణ్యసదనమైన వదనం నుండి పూరింపబడే పాంచజన్య శంఖమా, భూతాలు, ప్రేతాలు, పిశాచాలు, బ్రహ్మరాక్షసులు మొదలైన వాటిని పారద్రోలు. నారాయణుని చేత ప్రయోగింపబడే నందక మహాఖడ్గమా, నా శత్రు వ్యూహాలను ఖండ ఖండాలుగా చీల్చి చెండాడు. ఈ భగవంతుని నామాలు, రూపాలు, వాహనాలు, దివ్యాయుధాలు పాపగ్రహాల వలన, క్రూర మృగాల వలన, సర్పాల వలన, అడవి పందుల వలన సంభవించే ఉపద్రవాలను తొలగించి నన్ను రక్షించుగాక! సామగానాలతో స్తోత్రం చేయబడే గరుత్మంతుడు నన్ను కటాక్షించుగాక! శ్రీమన్నారాయణుని నామ, రూప, వాహన దివ్యాయుధాలు నా బుద్ధిని, ఇంద్రియాలను, మనస్సును, ప్రాణాలను సంరక్షించుగాక!

ఈ సమస్త విశ్వాన్ని భగవంతుని స్వరూపంగా భావించి ధ్యానించేవారిని, అలంకారాలు, ఆయుధాలు ధరించి తిరుగులేనివాడై విరాజిల్లే మహావిష్ణువు అవశ్యం కాపాడుగాక! సమస్తలోక భయంకరమైన అట్టహాసంతో ప్రకాశించే వదన గహ్వరంతో తేజోవిరాజమానుడై శ్రీ నృసింహదేవుడు లోపల, వెలుపల అన్ని దిక్కుల నుండి నన్ను రక్షించుగాక!

ఈవిధంగా విశ్వరూపుడు శ్రీమన్నారాయణ కవచాన్ని దేవేంద్రునికి ఉపదేశించాడు. ఇంద్రుడు ఆ కవచాన్ని గ్రహించి దాని ప్రభావంతో తన శత్రువులైన రాక్షసులను జయించాడు. ఇంతటి బృహత్తమైన కవచాన్ని ఇచ్చినా విశ్వరూపుడికీ, ఇంద్రుడికీ దెబ్బలాటలు రావడం, మిగతా కథా వచ్చే నెల వ్యాసంలో చూద్దాం.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS